క్లుప్తంగా

కొండమీది గ్రామస్తులకు అండగా ఉంటాం

● వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: మండల పరిధిలోని కొండమీది గ్రామస్తులకు చల్లా కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి తెలిపారు. జూనూతల గ్రామంలో తాగునీటి సమస్యను చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సొంత నిధులను వెచ్చించి గ్రామంలో శుద్ధజల కేంద్రాన్ని నిర్మించి ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించారు. బుధవారం శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవుకుతో పాటు కొండమీది గ్రామాలైన ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయునిపల్లెల్లోని ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సమానమని, ఆయా గ్రామాల్లో ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించడం బాధ్యతగా తీసుకుంటానని తెలిపారు. స్థానికులు ఆయనకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

అవుకు: మండల కేంద్రం అవుకులో ఈనెల 21వ తేదీ గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు షిరిడీ సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉదయం 5.15 గంటలకు బాబాకు కాగడ హారతి, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ జరుగుతుందన్నారు. 8 గంటలకు గ్రామోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం సంధ్యా హారతి, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్యాపిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండలసర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.సర్వసభ్య సమావేశం నిర్వహించే తదుపరి తేదీని త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. వాయిదా వేసిన విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించాలని సూచించారు.

కంటి వైద్యానికి ఆర్థికసాయం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని స్వామినగర్ కాలనీలో నివాసం ఉంటున్న రామలక్ష్మమ్మ కంటి వైద్యానికి దాతలు బుధవారం ఆర్థిక సాయం అందించారు. ఆమెకు కంటి చూపు సరిగ్గా లేకపోవడంతో ఆపరేషన్ నిమిత్తం ప్రకృతి పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి పెనుగొండ బాబు, భూమా నాగరాజు, శివ తమ వంతుగా రూ. 5 వేల నగదుతోపాటు కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, సుబ్బయ్య, సుబ్బలక్ష్మమ్మ, రాములక్ష్మమ్మ పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు



వీధిలైట్లు లేక చీకటిగా ఉన్న ఆకుమల్ల మొయిన్ బజారు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో పలు కాలనీలు వీధిలైట్లు వెలగక అంధకారంలో ఉన్నాయి. వర్షకాలంలో విష పురుగులు తిరిగే అవకాశం ఎక్కువగా ఉంటాయని చీకటిలో భయంతో తిరుగుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సేవతోనే ఆత్మసంతృప్తి

బేతంచెర్ల: సమాజానికి సేవ చేయడంలోనే ఆత్మసంతృప్తి లభిస్తుందని.. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహాయసహకారాలు అందించాలని స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ట్రెజరర్ బుగ్గన మనోహర్‌రెడ్డి బేతంచెర్లలోని అన్నపూర్ణ అనాథాశ్రమం విద్యార్థులకు నిత్యావసర సరుకులు అందజేశారు. సాంబశివారెడ్డి, విష్ణు, డక్కి శేఖర్ పాల్గొన్నారు.

20న శ్రీశైల గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ఈ నెల 20వ తేదీ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నారు. గిరిప్రదక్షిణ, భ్రమరాంబాదేవికి లక్ష కుంకుమార్చన పూజలు జరిపించనున్నారు. గిరిప్రదక్షిణలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని దేవస్థాన అధికారులు విజ్ఞప్తి చేశారు.



కొలిమిగుండ్లలో గుండం వద్ద పూజలు చేస్తున్న మత పెద్దలు



ప్యాపిలి: ఏటికి వెళ్తున్న పీర్లు



సంజామలలో..

ఉప్పొంగిన భక్తిభావం



నిమజ్జనం కోసం జుర్రేరువాగుకు తరలుతున్న పీర్లు



బనగానపల్లె: మాతం నిర్వహిస్తున్న షియా మతస్తులు



మాతం కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన భక్తులు

● ముగిసిన మోహర్రం వేడుకలు
● మాతం చేసి భక్తిభావం చాటుకున్న షియా ముస్లింలు
● భక్తులతో కిక్కిరిసిన వీధులు

బనగానపల్లెరూరల్: పట్టణంలో మొహర్రం వేడుకలు బుధవారం పీర్ల నిమజ్జనంతో ముగిశాయి. దొరకోటలోని పీర్ల చావిడిలో బనగానపల్లె నవాబు వంశీయులు మీర్ ఫజలే అలీఖాన్, ఆయన కుమారుడు గులాం అలీఖాన్ ఆధ్వర్యంలో షియా మతస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పీర్ల నిమజ్జనం ప్రారంభమైంది. భక్తి గీతాలు ఆలపిస్తూ పీర్లను జుర్రేరు వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. షియా మతస్తులు బ్లేడ్లు, చురకత్తులతో తమ చాతి, వీపుపై మాతం చేస్తూ రక్తాని చిందించి భక్తిని చాటుకున్నారు. మాతం కార్యక్రమం నవాబుకోట నుంచి అస్తానం రోడ్డు, పాత బస్టాండ్, పొట్టిశ్రీరాములు విగ్రహం కూడలి మీదుగా జుర్రేరువాగు వద్ద ఉన్న నిమజ్జన ఘాట్‌కు చేరుకుంది. పీర్ల ఘాట్ వద్ద పీర్లను శుద్ధి చేసి, వాటిని మళ్లీ బాక్సుల్లో భద్రపరిచి ఆయా పీర్ల చావిడీలకు తరలించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శిబిరాలను ఏర్పాటు చేశారు. మాతం చూసేందుకు బనగానపల్లె మండలంతో పాటు కర్నూలు, నంద్యాల, హైదరాబాద్ ప్రాంతాల నుంచి హిందూముస్లింలు అధిక సంఖ్యలో తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిశాయి. పీర్ల నిమజ్జనంతో 40 రోజులు సంతాపం దినాలుగా పాటించడం ఇక్కడి షియా మతస్తుల ఆచారం.

ప్యాపిలి: పట్టణంలో బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు పీర్ల ఊరేగింపు ప్రారంభమైంది. దారి పొడవునా భక్తులు పీర్ల స్వాములకు చక్కెర చదివింపులు సమర్పించారు. బందేనవాజ్ పీర్లు సవారి అనంతరం చావిడిలోకి చేరుకునే దృశ్యాన్ని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం 5 గంటలకు పీర్లు ఏటికి వెళ్లే కార్యక్రమం ప్రారంభం కాగా యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. 14 పీర్ల చావిడీలలో కొలువైన పీర్ల ఊరేగింపు ప్రధాన వీధుల మీదుగా శోభాయమానంగా సాగింది. రాత్రి 10 గంటలకు స్థానిక వెంగన్న బావి వద్ద పీర్లను శుద్ధి చేసి ప్రత్యేక పెట్టెల్లో భద్రపరిచారు. అనంతరం ఆ పెట్టెలను విషాదగీతాలు ఆలపిస్తూ తిరిగి పీర్ల చావిడీలలో భద్రపర్చడంతో వేడుకలు ముగిశాయి.

బేతంచెర్ల: బేతంచెర్లతో పాటు ఆర్ఎస్ రంగాపురం, యంబాయి, మండ్లవానిపల్లె, రుద్రవరం, సిమెంట్ నగర్, బలపాలపల్లె, సీతారామాపురం గ్రామాల్లో పెద్ద ఎత్తున డప్పు వాయిద్యాలు, సాంస్కృతి కార్యక్రమాలు, యువకులు కోరింతల నడుమ ఏటికి వెళ్లే కార్యక్రమం కోలాహలంగా సాగింది. పలువురు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

డోన్/డోన్ టౌన్: పట్టణంలో మొహర్రం వేడుకలు వైభవంగా ముగిశాయి. ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సమస్యాత్మక గ్రామాల్లో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదు. భక్తులు అగ్నిగుండ ప్రవేశాలు చేసి భక్తిభావాన్ని చాటారు.

కొలిమిగుండ్ల: మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలు ముగిశాయి. బుధవారం మండలంలోని పెట్నికోట, బెలుం, మీర్జాపురం, బందార్లపల్లె, ఇటిక్యాల తదితర గ్రామాల్లో పీర్ల చావిళ్ల వద్దకు భక్తులు చేరుకుని చక్కెర చదివింపులు చేశారు. పీర్ల నిమజ్జనాన్ని పురస్కరించుకుని యువకులు వివిధ రకాల వేషధారణలు వేశారు. మేళతాళాలు, భక్త జనసందోహం మధ్య ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



కోవెలకుంట్లలో పీర్ల ఊరేగింపు

కోవెలకుంట్ల: పట్టణంలోని చిన్నబార్‌ఇమాం, పెద్ద బార్‌ఇమాం, ఆంజనేయస్వామి దేవాలయం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, సంతపేట, బసిరెడ్డిబావి వీధుల్లో పదిచోట్ల పీర్లను కొలువుంచారు. చివరి రోజు బుధవారం ఆయా చావిళ్లలోని బీబీఫాతిమా, ఇమాంకాశీం, అజరత్ అలీ అక్బర్, చిన్నబార్‌ఇమాం, ఇమాంకాశీం, పెద్దబార్‌ఇమాం, హాజరత్ అబ్బాస్, హాజరత్ అలీ అబ్బాస్, దస్తగిరి స్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్లతో పాటు సొదరదిన్నె గ్రామంలోని బార్‌ఇమాం కాశీం పీర్లను అమ్మవారిశాల మెయిన్ బజార్‌లో ఊరేగించారు. ఆయా గ్రామ శివారులోని కుందూనది, పాలేరువాగుల్లో పీర్ల నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ జయచంద్ర, ఎస్ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంజామల: మండలంలో కులమతాలకు అతీతంగా పీర్ల ఊరేగింపునకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జనంతో వీధులు కిటకిటలాడాయి. యువకులు డప్పువాయిద్యాలకు చిందులేశారు. నిమజ్జనం అనంతరం పీర్ల పెట్టెలను ఆయా చావిళ్లలో ఉంచారు.



బనగానపల్లె: పీర్లను శుద్ధి చేస్తున్న దృశ్యం



బేతంచెర్లలో..



డోన్ వెంకటాపురం గ్రామంలో..

కొలిమిగుండ్లకు ట్రాక్టర్ మంజూరు

సాక్షి ఎఫెక్ట్

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల పంచాయతీలో చెత్త సేకరణ కోసం అధికారులు ట్రాక్టర్‌ను మంజూరు చేశారు. వృధాగా చెత్త సంపద కేంద్రాలు శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. కొలిమిగుండ్ల పెద్ద గ్రామం కావడం, కొండపై చెత్త సంపద కేంద్రం నిర్మించడంతో పాటు నాలుగు రిక్షాలు మూలనపడడంతో పారిశుద్ధ్య పనులు చేయడం కష్టంగా మారిందని పంచాయితీ కార్యదర్శి భాస్కర్‌రావు డీపీఓకు వివరించారు. కొలిమిగుండ్ల పంచాయితీకి ట్రాక్టర్ మంజూరైందని త్వరలో వస్తుందని ఆమె తెలిపారు. ట్రాక్టర్ రాగానే చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అవుకు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

● ఒడిశా సీఈఓ తిరుమల నాయక్



అవుకు: తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఒడిశా చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ తిరుమల నాయక్ అన్నారు. అత్యున్నత పదవి స్వీకరించిన తరువాత బుధవారం సొంత గ్రామం అవుకుకు వచ్చిన తిరుమలనాయక్ విలేకర్లతో మాట్లాడారు. 1980లో అవుకులోనే తాను జన్మించానని, ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఇక్కడి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుకున్నాని గుర్తు చేసుకున్నారు. ఆ తరువాత విద్యాభ్యాసాన్ని ఇతర ప్రదేశాల్లో పూర్తి చేసి 2004లో పశు వైద్యాధికారిగా ఉద్యోగం సాధించి, సంజామల మండలంలో బాధ్యతలు నిర్వహించానన్నారు. అనంతరం సివిల్స్‌కు సిద్ధమై 2008లో జాతీయ స్థాయిలో 450 ర్యాంక్ సాధించి ఒడిశా క్యాడర్ నుంచి ఐఏఎస్‌కు ఎంపికయ్యానని తెలిపారు. 2010లో ఒడిశాలోని బాలాసోర్ జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా, 2011లో బంజీనగర్ సబ్ కలెక్టర్‌గా, 2012లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా 2013లో కందమాల్ జిల్లా కలెక్టర్‌గా, 2019లో లేబర్ కమిషనర్‌గా, 2023లో అడిషనల్ సీఈఓగా, ఇటీవలే జూలైలో ఒడిశా చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా నియమితులైనట్లు మీడియాతో పంచుకున్నారు. తాను సీఈఓగా నియమించిన తరువాత పుట్టిన ఊరికి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. తాను చదివిన పాఠశాలను పరిశీలించి, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సీఈఓను పలువురు శాలువాలతో సత్కరించారు. సీఈఓ సోదరుడు, కడప ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి సేవియా నాయక్, స్థానికులు రామక్రిష్ణ, నందీశ్వరయ్య ఉన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



ప్యాపిలిలో ఏకలవ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎరుకల సంఘం నేతలు



డోన్‌లో ఏకలవ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

ప్యాపిలి: ఏకలవ్య జయంతిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ఏకలవ్య విగ్రహానికి ఎరుకల సంఘం నాయకులు నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు మనోరమ మాట్లాడుతూ.. ఎరుకల సోదరులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎల్లప్ప, మాధవి, వెంకటేశ్, మహేంద్ర, శేషాద్రి, మనోహర్, గోపాల్, శేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏపీ ట్రైబల్ ఫెడరేషన్ సభ్యులు ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి ఏకలవ్య గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరమేసి పరమేశ్, నాయకులు మధు, మాధవకృష్ణ, గుర్రప్ప, సుజాత, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్: ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలని ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మేడసారి గోపాల్, మోటా రాముడు డిమాండ్ చేశారు. ఏకలవ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎరుకల గ్రామాల్లో విద్య, వైద్య సౌకర్యాలు, రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు రామయ్య, నాయకులు సాలన్న, ప్రతాప్, శ్రీనివాసులు, మధు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



కోవెలకుంట్లలో పాండురంగ విఠలేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పలుకూరు గ్రామంలో పూజలు చేస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



బేతంచెర్లలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బేతంచెర్ల: పుట్ట పెద్దమ్మకు పూజలు

కోవెలకుంట్ల: ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి వేడుకలను బనగానపల్లె నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, విష్ణుసహస్రనామం, కనకధారాస్తోత్రం, గీతాపారాయణం, తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలంలోని గుళ్లదూర్తి, భీమునిపాడు, కలుగొట్ల, బిజనవేముల, రేవనూరు, లింగాల, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

బనగానపల్లె రూరల్: మండలంలో తొలి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం, షిరిడీ సాయినాథ్ ఆలయంతో పాటు రవ్వల కొండపై ఉన్న చెంచులక్ష్మీ సమేత పావన నరసింహస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే యాగంటి క్షేత్రంలో కొలువైన ఉమామహేశ్వర స్వామి, నందవరంలోని చౌడేశ్వరిదేవి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. పలుకూరు గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయాన్ని డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బేతంచెర్ల: మండలంలో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. ఆయా ఆలయాలకు భక్తులు బారులు తీరారు. అలాగే పుట్టపెద్దమ్మ ఆలయం, సిమెంట్ నగర్, ఎం.పెండేకల్లు, ఆర్ఎస్ రంగాపురం, బుగ్గానిపల్లె, ముద్దవరం గ్రామాల్లోని సీతారామ, ఆంజనేయస్వామి ఆలయాల్లో గ్రామస్తులు పూజలు చేశారు.

పూజారి ఇంట్లో చోరీ

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల గ్రామంలో పూజారి ఇంట్లో చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ బుధవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కునుకుంట్ల గ్రామ పొలిమేర వద్ద ఉంటున్న పూజారి కాకర్ల రాముడు ఇంటి తలుపులు, సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయ తలుపులు పగలగొట్టి పెద్దమ్మ తల్లికి చెందిన 62 తులాల వెండి, ఒక తులం బంగారు ఆభరణాలు, పూజారి ఇంట్లో రూ.1,03,500 నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కాకార్ల రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత



బాలుడిని తాతకు అప్పగిస్తున్న పోలీసులు

కోవెలకుంట్ల: పట్టణంలో జరిగిన మెహర్రం వేడుకల్లో తప్పిపోయిన రెండేళ్ల బాలుడిని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. బుధవారం సాయంత్రం స్థానిక అమ్మవారిశాల వీధిలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. సుంకులమ్మ దేవాలయ సమీపంలో నివాసం ఉంటున్న మునీర్‌బాషా కుమారుడు అపెక్స్‌ను తాత మహబూబ్‌బాషా పీర్ల ఊరేగింపు చూసేందుకు తీసుకెళ్లాడు. రద్దీ అధికంగా ఉండడంతో జనసందోహంలో బాలుడు తాత నుంచి తప్పిపోయాడు. తాతకోసం వెతుకుతూ ఏడుస్తుండడంతో గమనించిన కొందరు యువకులు ఆ బాలుడిని పోలీసులకు అప్పగించారు. మనవడి కోసం వెతుకుతూ మహబూబ్‌బాషా పోలీసుల వద్దకు రాగా మనవడిని తాతకు అప్పగించడంతో సుఖాంతమైంది.

ఊడిపడిన ఇంటిపైకప్ప



పెచ్చులు ఊడిన ఇల్లు



స్వల్ప గాయాలతో బయట పడిన కేశాలు, వరాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్.బుక్కాపురం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మోకాశీ కేశాలు, తల్లి తిమ్మక్క, భార్య వరాలు నిద్రిస్తుండగా ఇంటిపై కప్పు పెచ్చులూడి పడింది. అప్రమత్తమై లేవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో మోకాశీ కేశాలు, భార్య వరాలుకు స్వల్ప గాయాలయ్యాయి. తల్లి తిమ్మక్క దూరంగా నిద్రిస్తుండడంతో ఎలాంటి గాయాలు కాలేదు.